# పరాయికరణీయం

శ్రీ...పీ...పీ...

ఏదో ఆలోచనల్లో ఉన్న అంజయ్య ఈ లోకంలోకి వచ్చాడు. చూస్తే గేటు అవతల పడవలాంటి కారు. హడావిడిగా గేటు తీశాడు. కనీకనబడని కారులోని శాల్తీకి సలాం కొట్టాడు. కారు లోపలకు ఉరికింది. అంజయ్య గేటు మూశాడు.

అదో పదిహేనంతస్థుల భవనం. దాంట్లో ఎన్నో బహుళ దేశ సంస్థల కార్యాలయా లున్నాయి. ఇప్పటి కారు, ప్రపంచంలోనే పేరెన్నికగన్న ఓ ఆర్థిక సంస్థ యొక్క భారతదేశ అధిపతి తాలుకుది.

ఆ వ్యాపార సంకులంలో దాదాపు ఇరవై ఇలాంటి భవనాలున్నాయి. అన్నీ అధునాత నమైనవే. బ్యాంకులు, షేర్లలో మదుపుపెట్టే విదేశీ సంస్థలు, కార్పొరేట్ రంగ కంపెనీల ప్రశాసన కార్యాలయాలు, మొబైల్ కంపెనీల కేంద్ర కార్యాలయాలు మొదలగు బహుళ జాతి సంస్థలు అక్కడి నుండి మన దేశమంతా రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ అయిదు సంవత్సరాల క్రితం ఓ బట్టలు మిల్లు ఇరవై నాలుగు గంటలు పొగకక్కే గొట్టాలతో మిషిన్ల రణగొణ ధ్వనితో కార్మికుల చెమట వాసనలతో ఉండేదంటే నమ్మడం కష్టమే. కాని అది పచ్చినిజం.

ప్రపంచీకరణ, సరళీకరణ నేపథ్యంలో మన దేశ సంపదను తమ శాయశక్తులా దండుకోవడానికి ఎన్నో బహుళ దేశ సంస్థలు కాలూనాయి.

మదుపుపై తమ దేశాల్లో నాలుగైదు శాతం వడ్డీ కూడా గిట్టుబాటుకాని సందర్భంలో మన దేశానికి పెట్టుబడులు తరలించి, పదిహేను నుంచి యాభైశాతం లాభం దండుకోవడానికి పథకాలు రూపొందించాయి, ఈ ప్రపంచ సంస్థలు. అలాగే వారి దేశాల్లో ఎన్నో రెట్లు ఖరీదైన ఉద్యోగాలకు మన శ్రామికులను వాడుకుని మన కార్మికులకు శ్రమకు తగ్గ ఫలితం దక్కకుండా చేస్తున్నారు. వారు లాభాల రూపంలో, మన శ్రమశక్తి రూపంలో మనల్ని ఎంత దోపిడీ చేసినా విదేశీ మారకనిల్వలు పెరుగుతున్నాయని చంకలు గుద్దుకుంటోంది మన ప్రభుత్వం. ఆ నిల్వలు మన దేశ ఆర్థిక పరిస్థితి ఎంత అస్తవ్యస్తం చేస్తున్నాయో, చేయగలవో గుర్తించడంలేదు. పైపెచ్చు విదేశీ పెట్టుబడి విధానాలను, పన్ను విధానాలను ఆ సంస్థలకు అనుకూలంగా రూపొందిస్తోంది. పర్యవసానంగా అంజయ్యలాంటి ఎందరో కార్మికులను బతికిచెడ్డ వారిగా మారుస్తోంది.

అంజయ్య తండ్రి పాపయ్య, దాదాపు నలభై ఏండ్ల క్రితం కడుపు చేతబట్టుకుని బొంబాయి (ముంబయి) వచ్చాడు. ఓ బట్టల మిల్లులో లర్నర్‌గా చేరి సూపర్‌వైజర్ స్థాయికి ఎదిగాడు. మిల్లుకి దగ్గర్లో ఓ చాల్ (ఒంటి గదుల భవనం)లో రెండు గదులు సమకూర్చుకున్నాడు. జీవితనావ గాడిలో పడిందనుకునేంతలో ఓ ఉప్పెన వచ్చింది. స్వలాభానికి యజమానులను బెదిరించడం తప్ప కార్మిక పోరాట సిద్ధాంతాలు ఏమాత్రం ఒంటబట్టని దత్తాసామంత్ పిలుపునిచ్చిన బట్టల మిల్లుల సమ్మె, కార్మికుల పాలిట సమ్మెట పోటయింది. ఇరవై నెలలు మిల్లులు మూతపడేసరికి కార్మికుల కుటుంబాలు చిందర, వందర అయ్యాయి. కుటుంబ పోషణకై చిన్నా చితక పనులు చేయాల్సి వచ్చింది. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు, చిన్న, చితక పనుల్లో చేరాల్సి వచ్చింది. పూలమ్మిన చోట కట్టెలమ్మలేక పాపయ్య గుండెపోటుతో మరణించాడు. అతని కుటుంబం రోడ్డున పడింది. ఆయన భార్య గుండమ్మ, బతుకుతెరువుకై శ్రీమంతుల ఇండ్లల్లో పాచిపనికి కుదిరింది. కాన్వెంటులో చదువుతున్న ముగ్గురు పిల్లలు మునిసిపల్ పాఠశాలకు మారారు. ఒక మోస్తరు హోదాతో బాగా బతికిన కుటుంబం చితికి పోయింది. పెద్దబ్బాయి అంజయ్య పన్నెండో తరగతిలో చదువు ఆపేశాడు. చిన్నా చితక పనులు చేయసాగాడు. సమ్మె ముగిసింతర్వాత మిల్లులో హెల్పరు ఉద్యోగానికి అష్టకష్టాలు పడ్డాడు. చిట్టచివరకు యూనియన్ సహకారంతో మానవతా దృష్టికింద పాపయ్య స్థానంలో అంజయ్యకు హెల్పర్‌గా ఉద్యోగం వచ్చింది.

భర్త చనిపోయిన తర్వాత వచ్చిన అతని ప్రావిడెంట్ గ్రాచ్యుయిటీ, నష్టపరిహారం డబ్బుతో అంజయ్య పెళ్ళి చేసి మిగతా డబ్బు బ్యాంకులో వేసింది గుండమ్మ. ఇంకో

అబ్బాయిని, అమ్మాయిని మునిసిపల్ పాఠశాలలోనే కొనసాగించింది. ఇంటర్ కాగానే చిన్న కొడుకు ఓ ఫ్యాక్టరీలో మెకానిక్ గా చేరాడు.

ఓ పది సంవత్సరాలు సాఫీగా గడిచాయి. తమ్ముడి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేశాడు అంజయ్య.

అంతలో మళ్ళీ ఓ తుఫాను కుటుంబాన్ని కుదిపేసింది. ఈసారి ఉద్యోగంతోపాటు ఉండేనీడ కూడా ఊడింది. మిల్లు పూర్తిగా మూతపడింది. వాళ్లుంటున్న చాల్‌కూలింది ఆ చోట పెద్దభవనం కట్టడానికి కావాలనే కూలగొట్టారనే వదంతి వ్యాపించింది. నిస్సహాయులైన అంజయ్య లాంటి ఎందరో కార్మికులు నగర శివార్లకు తరలిపోయారు. ఊరికి తిరిగి వెళదామని గుండమ్మ ప్రతిపాదించింది. అక్కడి వారే ఇంకా ముంబయికి వలస వచ్చే సందర్భంలో మనం అక్కడికి వెళ్ళి ఏం చేయాలి? అంజయ్య ప్రశ్నకు గుండమ్మ దగ్గరజవాబులేదు.

బతుకుతెరువుకు గత్యంతరంలేక కుటుంబాన్ని ముంబయి శివార్లలోని ఓ మురికి వాడకు తరలించాడు అంజయ్య. అతని తమ్ముడు కూడా ఇంకో గుడిసె చూసుకుని వేరుపడ్డాడు.

అమ్మ, భార్య, ముగ్గురు పిల్లలను పోషించే బాధ్యత అంజయ్య ముందు సవాలై నిల్చుంది. పరిస్థితిని అర్థం చేసుకున్న అతని భార్య, ఓ రెడీమేడ్ దుస్తుల తయారీ ఫ్యాక్టరీలో కుట్టుపనికి కుదిరింది. గుండమ్మ కూడా తనకు చిరపరిచితమైన పాచిపని చూసుకుంది. ఇక అంజయ్య మిగిలాడు.

మూన్నెళ్ళు కాళ్ళరిగేలా తిరిగిన మీదట అంజయ్యకు ఓ సెక్యూరిటీ కంపెనీలో వాచ్‌మెన్ ఉద్యోగం దొరికింది. ఆ సెక్యూరిటీ ఏజెన్సీయే అతన్ని ఈ బహుళ అంతస్థుల భవనానికి వాచ్‌మెన్‌గా నియమించింది.

భారత సైన్యంలో కల్నల్‌గా చేసిన ఓ పెద్దమనిషి ఆధ్వర్యంలో నిర్వహింపబడే భద్రత సంస్థ అది. అంజయ్య లాగా పని అవసరం ఉన్న వారికి గాలం వేసి ఎంతోకొంత నెల జీతానికి కుదుర్చుకుని, వాచ్‌మెన్ సేవలు అవసరం ఉన్న కంపెనీలకు 'సరఫరా' చేస్తుంటారు. దానికి ఆ సంస్థ నుండి దండిగా ప్రతిఫలం తీసుకునే సెక్యూరిటీ ఏజెన్సీలు, దాంట్లో యాభై శాతం కూడా అసలుపని చేసే వారికి విదిల్చవు. క్రమశిక్షణకు మారుపేరైన రక్షణశాఖలో పని చేసిన వారు మాజీలుగా మారగానే లాభాపేక్ష కలిగిన, నియంతలుగా మారుతారు. ఇంకొకరి కష్టఫలాన్ని భుజిస్తారు.

పని పరాయికరణ (ఔట్‌సోర్సింగ్) కూడా ప్రపంచీకరణ పెట్టిన భిక్షే. మునుపు ఏ సేవకైనా ఆయా సంస్థలు సిబ్బందిని నేరుగా నియమించుకునేవి. వారికి జీతభత్యాలే

కాకుండా చట్టపరమైన అదనపు సౌకర్యాలు కల్పించేవారు. ప్రావిడెంట్‌ఫండ్, గ్రాచ్యుయిటీ, కార్మిక ఆరోగ్యబీమా, సెలవులు, నిర్ణీతమైన పని గంటలు మొ॥ సమకూర్చేవారు. ఈ కాంట్రాక్టు పద్ధతి వల్ల యాజమాన్యానికి అదనపు సౌకర్యాల ఖర్చు దక్కడమే కాకుండా వారికి హెచ్చు జీతభత్యాలు ఇచ్చే బాధ్యత నుండి కూడా విముక్తి దొరికింది. ఈ ఏజెన్సీలు సిబ్బందిని వేరువేరు సంస్థలకు ప్రతినెలా మారుస్తుండడం వలన ఉద్యోగానికి స్థిరత్వం లేదు. అంజయ్యలాంటి అభాగ్యులకు చాలీచాలని నెల జీతం తప్ప వేరే ప్రయోజనం లేదు. పైగా నాలుగు గంటలు ఎక్కువ పని చేయాలి.

మునుపటి మిల్లు ఉద్యోగం చిన్నదైనా ఎన్నో అదనపు సౌకర్యాలు అనుభవించిన అంజయ్యకు ఈ వాచ్‌మెన్ ఉద్యోగం దినదినగండం నూరేళ్ళాయుష్షుగా పరిణమించింది. ఇంకోదారి లేక అతను ఎన్నో అవమానాలను మోస్తూ రోజుకు పన్నెండు గంటలు శ్రమిస్తున్నాడు. మిల్లు పని ఎనిమిది గంటలు మాత్రం కావడంతో అతనికి తన కుటుంబ సభ్యులతో గడిపే వెసులుబాటు ఉండేది. ఇప్పుడతని పని చేసే చోటు ఇంటికి దూరంగావడంతో రోజుకు మూడు గంటలు ప్రయాణంలోనే గడుస్తున్నాయి. సబర్బన్ రైలు ప్రయాణం నిత్యనరకంగా ఉంది. అతని ఆరోగ్యం క్షీణించసాగింది. గుండమ్మ ఉబ్బసం వ్యాధి ముదిరింది. బోటాబొటీగా సరిపోయే ఆదాయం, మందుల ఖర్చులను జీర్ణించుకోలేకపోయింది. ఫలితం ? పెరిగిన అప్పులు.

ఆ పరిస్థితుల్లో తన పెద్దకొడుకు చదువుకు స్కూల్ ఫైనల్‌తో మంగళం పాడించి, అతన్ని ఆఫీసులు శుభ్రపరిచే పనికి కుదిర్చాడు. సూరి పని చేసేది ఓ ఫెసిలిటీ మానేజ్‌మెంట్ కంపెనీలో... ఆ కంపెనీ కొన్ని సంస్థల కార్యాలయాలు శుభ్రపరిచే కాంట్రాక్టు కుదుర్చుకుంటుంది. ఆ సంస్థలకు సూరిలాంటి యువకులను 'సరఫరా' చేస్తారు. పాచిపనిలో కూడా పని పరాయికరణే! కార్మికులు పనిచేసే కంపెనీ వారికి జీతం ఇవ్వదు, వారికి జీతం ఇచ్చే సంస్థకు వారు పని చేయరు! వీరిని కూడా నెలకోసారి ఓ సంస్థ నుండి ఇంకో సంస్థకు మారుస్తారు. ఇలా కార్మికుల శ్రమదోపిడీ చేసే దళారీ సంస్థలు ప్రభుత్వం సాక్షిగా నిత్యకల్యాణం పచ్చతోరణంగా విలసిల్లుతున్నాయి.

చట్టబద్ధమైన సౌకార్యాల కల్పన నుండి తప్పించుకుంటున్నాయి.

స్కూల్‌ఫైనల్ చదివిన పదహారేళ్ళ సూరికి పాచిపని చేయడం నామోషీగా ఉంది. అయినా అసహాయుడు. పద్దెనిమిదేళ్ళకుగాని అతనికి ఉద్యోగార్హతరాదు. అంతదాకా కుటుంబ బాధ్యత పంచుకుంటూ చదువును కూడా కొనసాగించాలని నిశ్చయించాడు సూరి. ప్రైవేటుగా ఇంటర్ కట్టడానికి పుస్తకాలు కూర్చుకున్నాడు.

సూరికి పద్దెనిమిదేళ్ళు నిండేసరికి అతని ఇంటర్ చదువు పూర్తయింది. నైట్ కాలేజీలో డిగ్రీ చదువు కొనసాగించాడు. పనిలో పనిగా మంచి ఉద్యోగాన్వేషణలో పడ్డాడు. సూరిలో మెరుపును గమనించిన యాజమాన్యం అతన్ని తమ కార్యాలయంలో ఆఫీసు అసిస్టెంటుగా నియమించింది. అప్పటికే కంప్యూటర్ శిక్షణ పొంది ఉండటంతో అతని జీతం కూడా పెంచారు. అయినా అతనికి పర్మనెంటు ఉద్యోగులకు కల్పించే సౌకర్యాలు అందలేదు. చట్టబద్ధమైన సౌకర్యాల కల్పన నుండి తప్పించుకునే అడ్డదార్లు త్రొక్కి ఆ కంపెనీ ఉద్యోగుల హక్కులను కాలరాస్తోంది.

ఆఫీసులో పనిచేస్తూ డిగ్రీ చేస్తున్న సూరి, క్రమంగా చట్టాల్లోని నియమ నిబంధనలు అధ్యయనం చేయసాగాడు. భద్రత, శుభ్రత, కోరియర్, సేవల ఏజన్సీలు, పని పరాయికరణ ద్వారా పాల్పడుతున్న చట్ట అతీత కార్యకలాపాలను లోతుగా అభ్యసించాడు. పరిస్థితిని మార్చే అవసరం, అవకాశాలపై తన కాలేజీ మేట్స్‌తో ఆచార్యులతో, కార్మిక సంఘాలతో మంతనాలు జరిపాడు. ఔట్ సోర్సింగ్ ద్వారా వివిధ కంపెనీలకు సేవలందించే ఉద్యోగుల దోపిడీ అరికట్టే ఉపాయాలు అన్వేషించాడు. అట్టివారికి యూనియన్ అండలేనందున వారిని ఆదుకోవడం అంత సులవైన పనికాదని తేలింది. ఓ నెలలో ఓ సంస్థలో పని చేసినవారు ఇంకోనెలలో వేరే సంస్థకు మార్చబడుతుండడంతో వారిని సంఘటిత పరిచి ఏకత్రాటిపై తీసుకు రావడం చాలా కష్టం. ఎప్పుడు డ్యూటీ నుండి రిలీవై గంటలకు గంటలు ప్రయాణం చేసి, ఎప్పుడు ఇల్లు చేరుదామా అని ఆత్రపడే వారికి యూనియన్‌గా సంఘటితమయ్యే తీరిక, ఓపిక ఎక్కడ? పైగా యూనియన్ సమ్మె పిలుపునిస్తే రోజు గడిచేదెలా? ఇంట్లోకి గ్రాసం అందేదెలా? సూరి బుర్రవేడెక్కింది. కాలేజీ మిత్రులతో మాట్లాడాడు. పని పరాయికరణ ద్వారా ఉద్యోగుల శోషణ చేసే సంస్థల ఆగడాలను అరికట్టే విధానాలను వారితో చర్చించాడు. అందరూ కలిసి కట్టె విరగకుండా పాముచచ్చే వ్యూహం పన్నారు.

ఈ సమస్యపై విద్యార్థి సంఘ నేతలు వార్తా పత్రికల్లో వ్యాసాలు ప్రచురించారు. గణాంకాలతో సహా వివరాలు ఇచ్చి ఆయా అధికారుల కన్నులు తెరిపించారు. సెమినార్లు నిర్వహించి దీనికి ఉద్యమరూపం తీసుకువచ్చారు. బహుళ దేశ సంస్థల కార్మిక విరోధ విధానాలను ఎండగట్టారు. కార్మిక సంఘాలు కూడా ఈ సమస్యను ఎత్తుకున్నాయి. దీని ప్రతి ధ్వని రాష్ట్ర శాసనసభలో మ్రోగింది. ఈ సమస్య కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని రాష్ట్ర ప్రభుత్వం నెపం ఢిల్లీపై నెట్టింది. తన చేతులు దులుపుకుంది.

విద్యార్థి సంఘాలు, కార్మిక యూనియన్లు, విషయం ప్రతిపక్ష పార్లమెంటు సభ్యుల దృష్టికి తెచ్చాయి. వారు ప్రభుత్వాన్ని నిలదీశారు. రెండు రోజులు పార్లమెంటు వ్యవహారాలను స్థంభింప చేసి కేంద్రమంత్రి వర్గాన్ని ఇరకాటంలోపెట్టారు. ఔట్‌సోర్సింగ్ సంస్థల ద్వారా సేవలందించే ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల అధ్యయనానికి ఓ కమిటీని నియమించారు. వారి రిపోర్టు మూడు నెలల్లో రావాలనీ, దానిపై వెంటనే పార్లమెటులో చర్చించి వీలైనంత తొందరగా ఓ సమగ్రచట్టం తెస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉద్యోగులు శాంతించారు. ఈ ఉద్యమానికి సూత్రధారి సూరి మాత్రం తెరచాటునుండే గ్రంథం నడిపించాడు. ప్రస్తుతం అతని ఉద్యోగానికేం డోకాలేదు!

ప్రభుత్వం నియమించిన అన్ని కమిటీల్లాగే ఈ కమిటీ సిఫారసులు అటకెక్కుతాయా? వేచి చూద్దాం.

ఎందరు ఊరుకున్నా సూరి మాత్రం ఊర్కోడు గాక ఊర్కోడు.